# సూర్య

www.suryaa.com

కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం,18 జూన్ 2024




## అంగరంగ వైభవంగా
# మీసాల స్వామి కళ్యాణం



**ఏలేశ్వరం,మేజర్‌న్యూస్ :** పవిత్రయాలా నది తీరాన వేంచేసి ఉన్న శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన పురోహితులు వేదుల సూర్యనారాయణ శర్మ, అమరేంద్ర అవధానుల ఆధ్వర్యంలో ఆగమ శాస్త్ర అనుసారం రమా సత్యనారాయణ స్వాముల కళ్యాణం వేదమంత్రాలతో కనుల విందుగా నిర్వహించారు.సోమవారం ఉదయం స్వామివారు అమ్మవార్లను ప్రత్యేక పుష్ప అలంకరణ చేసి పెళ్లి కుమారుడు పెళ్లి కుమార్తెను చేశారు. సాయంత్రం ఏడు గంటల నుంచి స్వామివారి అమ్మవార్ల కళ్యాణం ప్రారంభించారు. ఈ కళ్యాణానికి తిలకించేందుకు పుర ప్రముఖులతో పాటు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో తిలకించారు. స్వామివారి అమ్మవార్లకు బొద్దిరెడ్డి వీరభద్రరావు దంపతులు పొట్టు వస్త్రాలను సమర్పించి వారి భక్తిని చాటుకున్నారు. కాగా నాలుగు దశాబ్దాల క్రితం పవిత్ర యాల నది తీరాన పెద్దాపురం అలకి కుటుంబ సభ్యులతో నిర్మాణం చేపట్టిన రమా సత్యనారాయణ స్వామి వారి ఆలయం ఐదేళ్ల క్రితం అన్నవరం సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో విలీనమైంది అప్పటినుంచి ఆలయానికి సంబంధించిన పూజాకార్యాలు ఆలయ అర్చకుల జీతభత్యాలు అన్నవరం దేవస్థానమే చెల్లిస్తోంది ఈ నేపథ్యంలో స్వామివారి కళ్యాణం వైభవంగా నిర్వహించేందుకు అన్నవరం దేవస్థానం సిబ్బంది పాల్గొని ఆలయాన్ని పూలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్థానిక అర్చకులు పొన్నూరు వెంకటరమణాచార్యులు, సత్యనారాయణ ఆచార్యులు, ఆలయ సిబ్బంది, స్వామి వారి దీక్ష ప్రచారక్ కృష్ణ బాబు, కొంతం సతీష్, కొంపెల్ల బాబి తదితరులు పాల్గొన్నారు.

## పోలవరం విషయంలో జగన్ క్షమించరాని
# తప్పులు చేశారు
## - చంద్రబాబు



**ఉమ్మడిగోదావరి జిల్లాల సూర్యబ్యూరో :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు అనేక సంక్షోభాలను ఎదుర్కొందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన తొలిసారిగా పోలవరం ప్రాజెక్టును సందర్శించారు..అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు.

స్పిల్‌వే, కాఫర్ డ్యామ్, డయాఫ్రమ్ వాల్ పనుల పురోగతిపై జలవనరుల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఆతర్వాత మీడియాతో చంద్రబాబు మాట్లాడారు.

**తెదేపా హయాంలోనే 72శాతం పూర్తి..**"పోలవరం ప్రాజెక్టు కోసం నేనుపడిన కష్టాన్ని జగన్ బూడిదలో పోసిన పన్నీరు చేశారు. ఈ ప్రాజెక్టుకు ఎలాంటి ఆటంకాలు రాకూడదనే ఉద్దేశంతో తెలంగాణలోని ఏడు మండలాలను ఏపీలో విలీనం చేసేలా ఆనాడు కేంద్రాన్ని ఒప్పించాను. ప్రాజెక్టు మొదలు పెట్టిన దగ్గర నుంచి ఎన్నో సంక్షోభాలు ఎదురయ్యాయి. జాతీయ ప్రాజెక్టుగా విభజన చట్టంలో చేర్చడంతో తెదేపా హయాంలోనే 72 శాతం ప్రాజెక్టును పూర్తి చేశాం. 15 లక్షల క్యూసెక్కులు స్పిల్ వేపై డిశ్చార్జ్ అవుతాయి"

**రాష్ట్రానికి శాపంగా జగన్..**"రాజకీయాల్లో ఉండదగని వ్యక్తివచ్చిరాష్ట్రానికి శాపంగా మారారు. వైకాపా ప్రభుత్వం రాగానే రివర్స్ టెండరింగ్ చేపట్టారు. ఏజెన్సీతోపాటు సిబ్బందినీ మార్చారు. డయాఫ్రమ్ వాల్‌నుగత ప్రభుత్వం కాపాడుకోలేదు. పోలవరం విషయంలో జగన్ క్షమించరాని తప్పులు చేశారు.'ఈప్రాజెక్టుపైనేను వందసార్లు సమీక్షించా.. 30 సార్లు సందర్శించా.రూ.446 కోట్లతో మరమ్మతులు చేసినా బాగవుతుందనే పరిస్థితి లేదు. సమాంతరంగా డయాఫ్రమ్ వాల్ కడితే రూ.990 కోట్లు ఖర్చవుతుంది. గతంలో ప్రాజెక్టు నిర్మాణం కొనసాగి ఉంటే 2020 చివరినాటికి పూర్తయ్యేది. పోలవరం పూర్తికి నాలుగు సీజన్లు కావాలని అధికారులు చెబుతున్నారు. అన్నీ సవ్యంగా జరిగితేనే నాలుగేళ్లు పడుతుందని అధికారులు అంటున్నారు"

**వేల కోట్ల ప్రజాధనం వృథా..**

"ఎలాంటి వ్యక్తి రాజకీయాల్లో ఉండకూడదో ఇదొక కేస్‌స్టడీ.రూ.వేల కోట్ల ప్రజాధనం వృథా అయ్యింది. అప్పుడే ప్రాజెక్టు చేపడితే తక్కువ ఖర్చుతో పూర్తయ్యేది. ప్రస్తుతం ప్రాజెక్టు వ్యయం పెరిగింది. నష్టం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి.

ఏజెన్సీని మార్చవద్దని కేంద్రం రాష్ట్రానికి చెప్పింది. అలా మార్చితే ప్రాజెక్టుకు జవాబుదారీతనం ఉండదని చెప్పారు.ఏజెన్సీలను మార్చడమే ప్రాజెక్టు ఆలస్యానికి కారణం. దీనికి బాధ్యత ఎవరు తీసుకుంటారు?. ప్రజలనే కాదు, మీడియాను, ప్రతిపక్ష నేతగా నన్ను కూడా ఇక్కడికి రానీయలేదు. ప్రస్తుతం ప్రాజెక్టు అంతా క్లిష్టంగా మారిపోయింది. ఈచిక్కుముడులు అన్నీ విప్పే ప్రయత్నం చేస్తున్నాం. ఈ ప్రాజెక్టు ద్వారా నదులు అనుసంధానం చేసి రాష్ట్రంలోని ప్రతీ ఎకరాకు నీరు ఇవ్వాలని కలలు కన్నా. రాష్ట్రంలోని ప్రతి వక్తికి చెందిన ప్రాజెక్టు ఇది" అని చంద్రబాబు అన్నారు.

## కొమరగిరి ఇళ్ళ స్థలాల అవకతవకలపై...
# న్యాయ విచారణ

కొమరగిరి ఇళ్ళ స్థలాల కోసం భూముల కొనుగోలు, ల్యాండ్ ఫిల్లింగ్‌లో పెద్దయెత్తున అవినీతికి మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డితెరతీశారని... ఈ భారీ అవినీతిపై న్యాయ విచారణ చేయిస్తామని... ఇక్కడ జరిగిన అవినీతిపైన నివేదికను మా అధిష్టానానికి సవివరంగా ఇస్తామని... కాజేసిన కోట్ల రూపాయలను పైసాతో సహా కక్కిస్తామని ఎమ్మెల్యే వనమాడి కొండబాబు స్పష్టం చేశారు. సోమవారం హౌసింగ్ బోర్డు అధికారులతో కలసి కొమరగిరి లేఅవుట్‌ని పరిశీలన చేశారు. కాకినాడ నగరానికి 16 కిలోమీటర్ల దూరంలో ఎకరానికి 45 లక్షలుఇచ్చిఏకంగాసుమారు350ఎకరాలుకొన్నారని... కోట్ల రూపాయలతో దొంగ ఫిల్లింగ్ చేసి... మొత్తం వ్యవహారంలో వందల కోట్ల అవినీతికి మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి తెర తీసారని కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు అన్నారు.

ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :





- పేదల స్థలాలలో మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి అవినీతి...!
- భూమి కొనుగోలు, ల్యాండ్ ఫిల్లింగ్‌లో అక్రమాలు
- ప్రభుత్వ సొమ్మును కాజేసిన దొంగలను వదిలేది లేదు
- కొమరగిరిలో పేదలకు ఇచ్చిన జగనన్న లేఅవుట్ పరిశీలించిన ఎమ్మెల్యే కొండబాబు
- 16 కిలోమీటర్ల దూరంలో కాకినాడ నగరవాసులకి ఇళ్ళా...!
- టిడ్కో ఇల్లు నిర్మించి ఉన్నా పేదలకు ఇవ్వని ద్వారంపూడి
- కనీస మౌలిక సదుపాయాలు కూడా ఏర్పాటు చేయలేదు..!
- మొత్తం అవినీతిపై న్యాయ విచారణ చేయిస్తాం : వనమాడి

పేదవాడి స్థలాల పేరుతో కొమరగిరి ప్రాంతం నందు గత వైసిపి ప్రభుత్వంలో భూమి కొనుగోలు మరియు ల్యాండ్ ఫిల్లింగ్‌లో భారీ అవినీతి జరిగిందని, కొమరగిరి లేఅవుట్‌లో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టి, ప్రభుత్వ సొమ్మును కాజేసినవారిపైచర్యలుచేపట్టడం జరుగుతుం దని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు.కాకినాడఅర్బన్‌నియోజవర్గానికి సంబంధించి కొమరగిరిలో పేదలకు ఇచ్చిన జగనన్న లేఅవుట్‌ను సోమవారం హౌసింగ్ అధికారులతో కలిసి కొండబాబు సమీక్షించి, లబ్ధిదారులతో మాట్లాడి కొమరగిరి లేఔట్‌లో నెలకొన్న సమస్యలనుఅడిగి తెలుసుకొని,మంచినీటి సరఫరా మరియు విద్యుత్ సమస్యలపై చేపట్టవలసిన చర్యలపై సంబంధిత అధికారులకు ఆదేశించారు.

అనంతరం కొండబాబు మీడియాతో మాట్లాడుతూ కొమరగిరి ఇళ్ల స్థలాల భూమి సేకరణ మరియు ల్యాండ్ ఫిల్లింగ్‌లో ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి భారీ అవినీతికి పాల్పడ్డాడని, ప్రభుత్వ ఖజానాను దోచుకోవడానికి ద్వారంపూడి కాకినాడ నగరానికి 16 కిలోమీటర్లు దూరం నందు సముద్ర తీర ప్రాంతం కొమరగిరి గ్రామంలో సుమారు 350 ఎకరాల్లో ఇళ్ల స్థలాల కోసం లేఅవుట్ వేసి, 16,500 పట్టాలు ఇవ్వగా నాలుగు సంవత్సరాలు కావస్తున్నా ఇక్కడ కేవలం 250 మంది మాత్రమే ఇల్లు నిర్మాణం చేసుకున్నారని, లబ్ధిదారుల చేత బలవంతంగా బేస్మెంట్లు వేయించి పేద వర్గాలను నట్టేట ముంచాడని, సముద్ర కోతకు గురయ్యి, చిన్నపాటి వర్షానికి గురయ్యే ప్రాంతాన్ని ఎంపిక చేసి దోచుకున్నారని, తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో పేదవారి కోసం టిడ్కో గృహాలు నిర్మించి ఉన్నా అవి పేదవాళ్ళకు అందచేయకుండా వాటిని నిరుపయోగం చేశాడని, సాగరమాల ప్రాజెక్ట్ కోసం ఎకరం పొలం 20 లక్షలకు రైతుల నుండి ప్రభుత్వం కొనుగోలు చేస్తే, ఇక్కడ అదే భూములను ద్వారంపూడి 45 లక్షల పైబడి కొనుగోలు చేయించి వేల కోట్లు కాజేసాడని, ల్యాండ్ ఫిల్లింగ్ పేరుతో సుమారు 66 కోట్లు ప్రభుత్వ సొమ్మునుకాజేసి,కనీసమౌలిక సదుపాయాలు కూడా ఏర్పాటు చెయ్యకుండా లబ్ధిదారులను గాలికి వదిలేసాడని, కొమ్మరిగిరి స్థలాల కొనుగోలులో జరిగిన అవినీతిపై పూర్తిసాక్షాధారాలతో నివేదికను ప్రభుత్వానికి అందజేసి, ప్రభుత్వ సొమ్ములను కాజేసిన ద్వారంపూడిపై చర్యలు చేపట్టి, పైసాతో సహా వసూలు చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్, డివిజనల్ ఇంజనీర్స్ మరియు అసిస్టెంట్ ఇంజనీర్స్, నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, ఒమ్మి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.





# పిల్లి కళ్యాణ్ కృష్ణ తీరుపై టిడిపి అధిష్టానానికి తెలియజేస్తాం

- ఎమ్మెల్యే పంతం నానాజీ
- వైసీపీకి పనిచేసి, టిడిపి అని బ్యానర్లతో క్యాడరును తప్పుదోవ పట్టిస్తున్న కళ్యాణ్ కృష్ణ
- ఒక ఫోటోతో జోరుగా ప్రచారం

**కాకినాడ రూరల్,మేజర్‌న్యూస్ :** తల్లిదండ్రులు చెప్పిన వినకుండా కూటమి అభ్యర్థిని ఓడించాలని ప్రయత్నించిన వ్యక్తి పిల్లి కళ్యాణ్ కృష్ణ అని, మంత్రితో ఒకఫోటో తీసుకుని ఇక్కడ పార్టీల క్యాడర్‌ను తప్పుదోవ పట్టిస్తున్నారని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. సోమవారంగుడారగుంట ఆయన నివాసంవద్దటిడిపి శ్రేణులతో కలిసి మీడియాతో మాట్లాడారు.ప్రధానంగానాగెలుపుకు టిడిపిమాజీ ఎమ్మెల్యే కోఆర్డినేటర్ పిల్లి అనంతలక్ష్మి దంపతులు,కోకో ఆర్డినేటర్‌కటకం శెట్టిబాబి,టిడిపినాయకులువాసిరెడ్డిఏసుదాసు,నులుకుర్తి వెంకటేశ్వర రావు, పెంకే శ్రీనివాస్ బాబా, చప్పిడి వెంకటేశ్వర రావులు వంటి నాయకులు శక్తి వంచన లేకుండా నాతోపాటుతిరుగుతూనా విజయా నికి కృషి చేశారన్నారు. కానీ పిల్లి కళ్యాణ్ కృష్ణ అనే వ్యక్తి వైసిపి పార్టీతో చేతులు కలిపి పిల్లి అనంతలక్ష్మి దంపతులకు, నాకు చాలా బాధ కలిగించే విధంగావ్యవహరించడన్నారు.తల్లిదండ్రులు ఒకవైపు కూటమి విజయానికి ఎంతో కష్టపడి తిరుగుతున్నా, వైసిపి పార్టీతో తిరుగుతూ కాకినాడ రూరల్ లో కూటమి అభ్యర్థి అయిన పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) అనే నా ఓటమి చెందడం ఖాయం అంటూ ఛాలెంజ్ చేసేవాడన్నారు. అంతే కాకుండా ఎలక్షన్ రోజున వైసిపి నాయకులతో కలిసి ఎలక్షన్ బూత్ వద్ద నోట్లను పంచారన్నారని, ఇప్పుడు ఏమీ ఎరగనట్లు మంత్రి సుభాష్‌తో ఒక ఫోటో దిగి, మేము తెలుగుదేశం పార్టీ అని కాకినాడ రూరల్ లో పలుచోట్ల ప్లెక్సీలతో జోరుగా ప్రసారం చేస్తున్నారన్నారు. అయితే పిల్లి కళ్యాణ్ కృష్ణ తీరు టిడిపి నాయకులకు, కార్యకర్తలకు బాధ కలిగిస్తుందని, టిడిపి పార్టీ ఎంతో క్రమశిక్షణ కలిగిన పార్టీ అన్నారు. ఈ విషయంపై తెలుగుదేశం పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు
# ఘన స్వాగతం

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్యబ్యూరో :**

పోలవరం ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు మంత్రులు, జిల్లా అధికారులు, ఇరిగేషన్‌శాఖ అధికారులు, ఎమ్మెల్యేలు, పలువురు నేతలు ఘనస్వాగతం పలికారు. ప్రాజెక్టు క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులతో సమీక్ష నిర్వహించారు.



















## శ్రీ సత్యదేవుని నిత్య అన్నదాన పథకానికి రూ.1,00,116 విరాళం



**అన్నవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా శంఖవరం మండలం అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణస్వామివారి దేవస్థానంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి కాకినాడ జిల్లా కాకినాడ వాస్తవ్యులు పి.రాజా, శ్రీదేవి రూ.1,00,116 విరాళం అన్నదానం సూపర్డెంట్ కంచి మూర్తి కి అందజేశారు. దీనిపై వచ్చే వడ్డీతో ది 13 -06-2025 తేదీన అన్నదానం జరిపించాలని దాత కోరినారు. దాతను మూర్తి అభినందించారు.

## 104 ఉద్యోగులు జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మలకు వినతి పత్రం



**పెద్దాపురం, మేజర్న్యూస్ :** కాకినాడ జిల్లా జనసేన జిల్లా అధ్యక్షులు మరియు పెద్దాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి తుమ్మల రామస్వామి (బాబు)కు సోమవారం 104 ఉద్యోగుల రాష్ట్ర కమిటి పిలుపు మేరకు ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా జనసేన అధ్యక్షులు తుమ్మల బాబు స్పందిస్తూ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్‌కు ఈ విషయం దృష్టిలో పెట్టి 104 ఉద్యోగులందరికి న్యాయం చేసే విధంగా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో పి.శ్రీకాంత్, ఎం.త్రిమూర్తులు, వెంకట్రావు, శ్రీనివాస్, తేజ, హరిప్రసాద్, పలువురు 104 ఉద్యోగుల పాల్గొన్నారు.

# తెలుగు ప్రజల జీవనాడి వంటి పోలవరం ప్రాజెక్ట్‌ను గత ప్రభుత్వం సర్వనాశనం చేసింది

## -సీఎం చంద్రబాబు



**పోలవరం,మేజర్న్యూస్ :** పోలవరం తెలుగు ప్రజల జీవనాడి అని అటువంటి బహుళార్థసాధక ప్రాజెక్ట్ ను గత ప్రభుత్వం సర్వ నాశనం చేసిందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. పోలవరం ప్రాజెక్ట్ సైట్ ప్రాంతంలో ప్రాజెక్ట్ నిర్మాణ పనులను సహచర మంత్రులు ఇంజనీరింగ్ అధికారులతో సోమవారం ముఖ్యమంత్రి పరిశీలించారు.అనంతరం అధికారులతో సమీక్షించిన అనంతరం మీడియా ప్రతినిధుల సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ చైనా లోని త్రీ గోర్జెస్ కన్నా ఎంతో గొప్పదని, త్రి గోర్జెస్ కన్నా అధిక స్థాయిలో నీటి విడుదల సామర్థ్యం గల ప్రాజెక్టన్నారు. 194 టి ఎం సి ల నీటి నిల్వ సామర్థ్యం, 320 టి ఎం సి ల వరకు వరద నీటిని వినియోగించుకోగలిగిన అవకాశం ఉన్న ప్రాజెక్ట్ పోలవరం ప్రాజెక్ట్ అన్నారు. తాను నదుల అనుసంధానికి శ్రీకారం చుట్టి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసేందుకు పోలవరం ప్రాజెక్ట్ పనులను వేగవంతం చేశానన్నారు. పోలవరం ప్రాజెక్టుపై 100 కి పైగా సమీక్షలు, 31 సార్లు క్షేత్రస్థాయిలో ప్రాజెక్ట్ పనులను పరిశీలించామని, పోలవరం ప్రాజెక్ట్ తో తనకు అంత అనుబంధం ఉందన్నారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తి అయితే రాష్ట్రంలో ఎక్కడా కరువు కనపడదన్నారు. తమ ప్రభుత్వం ప్రాజెక్ట్ నిర్మాణానికి 13 వేల 683 కోట్ల రూపాయలు ఖర్చుచేసి, 72 శాతానికి పైగా పూర్తి చేశామన్నారు. అదే వేగంతో పనులు పూర్తి చేసి ఉంటె 2020 చివరి నాటికే పోలవరం ప్రాజెక్ట్ పూర్తి అయ్యి ఉండేదన్నారు. గత ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ విధానంలో ప్రాజెక్ట్ నిర్మాణాన్ని ఆపివేసిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇరిగేషన్ కి 7100 కోట్ల కు కేటాయింపులు తగ్గించి, అదికూడా కాంట్రాక్టర్లకు అడ్వాన్స్ లుగా చెల్లించారనన్నారు. తమ హయాంలో446కోట్లరూపాయలతోడయాఫ్రమ్‌వాల్ నిర్మించామని ,గత ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయనీయకుండా కాంట్రాక్టర్ ను మార్చడం, అప్పటివరకు పనిచేసిన ఇంజనీరింగ్ సిబ్బందిని అందరినీ మార్చివేసానన్నారు. కాంట్రాక్టర్ ను మార్చవద్దని, ఇంజనీరింగ్అధికారులను మార్చవద్దని కేంద్ర జలసంఘం అధికారులు చెప్పినప్పటికీ గత ప్రభుత్వం మార్చిందన్నారు. 2019, 2020 లో వచ్చిన అధిక వర్షాల కారణంగా డయాఫ్రమ్ వాల్ 4 చోట్ల దెబ్బతిన్నదని, డయాఫ్రమ్ వాల్ మరమ్మతుకు 447 కోట్ల రూపాయలు ఖర్చు అవుతాయని, అయినప్పటికీ పూర్తిగా మరమత్తు అవుతుందని నమ్మకం లేదని,డయాఫ్రమ్‌వాల్ సమాంతరంగా కొత్తగా నిర్మించేందుకు 996 కోట్ల రూపాయలుఖర్చుఅవుతాయనిఅధికారులు తెలియజేస్తున్నారన్నారు. ఇందుకోసం 4 సీజన్లు అనగా 4 సంవత్సరాల సమయం పడుతుందని అధికారులు తెలియజేస్తురన్నారు.వేల కోట్లాది రూపాయల ప్రజా దానం వృధా చేశారన్నారు. ఇలా గత ప్రభుత్వం చేసిన అనేక తప్పిదాలుపోలవరం ప్రాజెక్ట్ పాలిట శాపాలుగా మారాయన్నారు. రాజకీయాలకు పనికిరని వ్యక్తి రాష్ట్రాన్ని పాలించడం రాష్ట్రానికి ఎలా శాపంగా మారుతాడో నన్నది గత ముఖ్యమంత్రి ఒక ఉదాహరణగా మిగులుతాడన్నారు.ఇన్నిక్షమించరాని తప్పిదాలు చేసిన గత ప్రభుత్వాన్ని ఎం చర్యలు తీసుకోవాలి అన్నది ప్రజలు తెలియజేయాలన్నారు. పోలవరం ప్రాజెక్ట్ పనులను ఎంత సంక్లిష్టం చేయాలో.. అంతా చేసి ప్రాజెక్ట్‌ను పనికిరాకుండా చేశారన్నారు. ఇది క్షమించరాని నేరమన్నారు. రాష్ట్ర మంత్రులు డా.నిమ్మల రామానాయుడు, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి, రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ పుట్ట మహేష్ యాదవ్ , శాసనసభ్యులు చిర్రి బాలరాజు,బడేటిరాధాకృష్ణయ్య(చంటి), చింతమనేని ప్రభాకర్, ఆరిమిల్లి రాధాకృష్ణ, సొంగా రోషన్ కుమార్, పితాని సత్యనారాయణ, జ్యోతుల నెహ్రూ, వసంత కృష్ణ ప్రసాద్, నిమ్మకాయల చైనా రాజప్ప, ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపాల్ కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఇరిగేషన్ శాఖ సలహాదారుఏం. వెంకటేశ్వరరావు, జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి,ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి సూర్యతేజ, ప్రభృతులు పాల్గొన్నారు.

## ఎంపి ఉదయ్ శ్రీనివాస్‌కు పెన్షనర్ల సంఘం శుభాకాంక్షలు




**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ ఎంపి తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్‌ను సోమవారం ఉదయం రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం కాకినాడ సంఘ సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు, విశ్రాంత ఆర్ & బి సూపరింటెండెంట్ ఎం.వి. వీరభద్ర స్వామి మాట్లాడుతూ సాధారణ ఎన్నికల్లో రాష్ట్రంలో తెలుగుదేశం, బిజెపి, జనసేన పార్టీల కూటమి ఘన విజయం సాధించడం పట్ల అభినందనలు తెలియజేశారు. ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగించాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలోనూ, కాకినాడ జిల్లాలోనూ పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై పాలకులు దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం కాకినాడ సంఘ అధ్యక్షులు ఎం.వి.వీరభద్ర స్వామి, గౌరవ అధ్యక్షులు జి.అప్పారావు, జనరల్ శెక్రటరీ యస్.యం. రామారావు, శెక్రటరీ చలపతి రావు, ఆర్గనైజింగ్ శెక్రటరీ జగదీశ్వరరావు, తుని అసోసియేషన్ అధ్యక్షులు పి మాధవరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ పాల్గొన్నారు.

## ఘనంగా లక్ష్మీదేవి తల్లి కొలుపు నిర్వహణ



**ఎటపాక, మేజర్ న్యూస్ :** ఎటపాక మండలం గొమ్ము కోయగూడెం గ్రామంలో సోమవారం లక్ష్మీదేవి తల్లి కొలుపు ఘనంగా నిర్వహించారు. ఈ పండుగలో ముందుగా ఆదివారం సాయంత్రం మేళ తాళాలతో దేవుని పూజా కార్యక్రమాలతో రాత్రి అంతా సంబరాలు, దేవుని పూనకాలతో ఘనంగా ప్రారంభించారు. రెండవ రోజు సోమవారం ఉదయం దేవుని ఊరేగింపుగా గంగా స్థానానికి తీసుకుని వెళ్లి గోదావరిలో పూజ కార్యక్రమాలు నిర్వహించి, తదనంతరం గ్రామంలో అన్ని వీధులలో దేవుని ఊరేగింపు చేసి, దేవుని గుడి వద్ద ప్రతిష్టించ్చారు. తరువాత భక్తులు భక్తి శ్రద్ధలతో తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ పండగ ప్రతి సంవత్సరం సంప్రదాయం ప్రకారం మే, జూన్ నెలలో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఈ కార్యక్రమంలో గ్రామ పూజారి కవులూరి వీరభద్రం, గ్రామ పటేల్ కవులూరి రాజులు, ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పూసం శ్రీను, గ్రామ పెద్దలు కవులూరు బాలరాజు, కామేశ్వరరావు, పోడియం హరిబాబు, రమేష్, నర్సయ్య, పెంటమ్మ, పోలమంచి సావిత్రి , తెల్లం బోదయ్య, పండా నరసింహారావు.గ్రామ యూత్, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కూచిపూడిలో రాణిస్తున్న కూనవరంకు చెందిన జోష్ణ సాయి



**కూనవరం, మేజర్ న్యూస్ :** కూనవరం గ్రామానికి చెందిన ఒక ప్రముఖ దినపత్రిక పాత్రికేయుడు తన కుమార్తె సాయికి ప్రాథమిక విద్యతో పాటు అత్యంత ప్రజాదరణ పొందిన కూచిపూడి నాట్యంలో శిక్షణ ఇప్పించటంగా కుమార్తె శిక్షణ పూర్తి చేసి నాట్య ప్రదర్శనలు పాల్గొనడం జరిగింది. ఆదివారం నాడు హైదరాబాదులో జరిగిన కూచిపూడి నాట్య ప్రదర్శనలు అవార్డుతో పాటు ప్రముఖుల అభినందనలు సొంతం చేసుకుంది. భారతదేశ చరిత్రలోనే ఈ కళకు అత్యంత పేరు ఉంది .అయితే ఇప్పుడున్న ఈ హైటెక్ యుగంలో యువత స్పీడ్ డ్యాన్స్ వైపు పరుగులు పెడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికి ఈ కళ గురించి చాలామందికి తెలియదు. కానీ మారుమూల ఏజెన్సీ ప్రాంతం అయినా కూనవరంకు చెందిన గంజి జోష్ణ సాయి ఇప్పుడున్న పరిస్థితులకు విరుద్ధంగా కూచిపూడి డాన్స్ వైపు అడుగులు వేసింది. పాల్వంచ కు చెందిన వరలక్ష్మి గురువు దగ్గర శిక్షణ పొందింది.శిక్షణలో రాటు తేలిన జోష్ణ సాయి తెలంగాణ ఆంధ్రప్రదేశ్ లో సైతం పలు ప్రదర్శనలు చేస్తూ పలువురి ప్రశంసలు పొందుతుంది .మరుగున పడుతున్న ప్రాచీన కళ ను నేర్చుకొని మన్యం ప్రాంతానికి మంచి పేరు తెస్తున్న గంజి జోష్న సాయి ని కూనవరం మండలం కు చెందిన అధికారులు గ్రామ పెద్దలు ప్రశంసిస్తున్నారు. తన తల్లిదండ్రులతో పాటు గురువు వరలక్ష్మి, అమ్మమ్మ అనసూయ, సహకారం తోనే ఈ రంగంలో రాణిస్తున్నట్లు జోష్ణ సాయి తెలిసింది.

## వేళంగి మెర్లాస్ జిల్లా పరిషత్ పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

- 45 సంవత్సరాల విరామం తరువాత ఆత్మీయ సమావేశం

- జూలై 21న ఘనంగా గురుపూజోత్సవానికి సన్నాహాలు





**కాకినాడ, మేజర్ న్యూస్ :** వారంతా 60 దశకంలో పాఠశాలలో చేరి, విద్య నేర్చి జీవితంలో స్థిరపడి ఆటు పోట్లు ఎదుర్కొని కుటుంబ బాధ్యతలు నెరవేర్చి పిల్లలను ప్రయోజకులను చేసి వారికి పెళ్ళిళ్ళు జరిపించి ఒక స్థాయికి చేర్చారు. రెక్కొలొచ్చిన పిల్లలు తమ సంసారాలతో ఇతర వ్యాపకాలతో జీవితాలు గడుపుతున్నారు. ఇన్నాళ్ళు కుటుంబాల కోసం అహొరాత్రులు శ్రమించిన నాటి తరం విద్యార్థులు నేడు విశ్రాంత జీవితం గడుపుతున్నారు. ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకునే సమయం లో ఒక్కసారిగా చిన్ననాటి జ్ఞాపకాలు, జతగాళ్ళు మదిలో మెదిలాయి.తలచిందే తడవుగా కుటుంబ బాధ్యతల నేపథ్యంలో ఎక్కడెక్కడికో వెళ్ళి స్థిరపడిన వాళ్ళంతా కాకినాడ కాస్మోపాలిటన్ క్లబ్బులో సమావేశమయ్యారు. ఒక్కసారిగా కళ్ళ ముందు ప్రత్యక్షం కావడంతో ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. కాకినాడ రూరల్ వేళంగిలో మెర్లాస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల1972- 78 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 1972-78విద్యా సంవత్సరంలో టెన్త్ చదువుకున్న పూర్వ విద్యార్థులు కాస్మోపాలిటిన్ ఫంక్షన్ హాల్ లో ఆత్మీయ కలయికను నిర్వహించారు.పాఠశాలలో వారి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యార్థులు ఒకరిని ఒకరు కలుసుకొని వారి వారి కుటుంబ పరిస్థితులను, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ పాఠశాలలో విద్యను అభ్యసించిన రోజుల్లో గత స్మృతులను నెమరు చేసుకున్నారు. పాఠశాల స్థాయి విద్యను అభ్యసించిన రోజులు ఎంతో విలువైన రోజులని ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు తమ మనోభావాలను వ్యక్తపరిచారు. తమ సహ విద్యార్థులు ఎవరైనా అనారోగ్యంతో, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుంటే వారికి అందరూ కలిసికట్టుగా ఆర్థిక సహాయం అందిస్తామని, అలానే పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. 44 సంవత్సరాల తర్వాత స్నేహితులను కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పూర్వపు విద్యార్థులు పాతూరి నరసింహారావు, రావుల సత్యం మాట్లాడారు. వచ్చేనెల 21వ తేదీన వేళంగి హైస్కూల్లో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో గురుపూజోత్సవ ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. అదే రోజు గురువులకు సన్మానం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్ని నారాయణ చౌదరి, తలాటం భాస్కరరావు, సీరం సూర్యప్రకాశరావు, పలువురు పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ స్ఫూర్తితోనే అన్నా క్యాంటీన్



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** స్థానిక కాకినాడ రోడ్ లో గల ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద ప్రతి సోమవారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో అన్నా క్యాంటీన్ ఏర్పాటుచేసి పేదలకు అన్నదానం నిర్వహిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత అన్నా క్యాంటీన్ నిలుపుదల చేయమని ఎన్నికల కమిషన్ ఆదేశించడంతో తాత్కాలికంగా నిరుపదలు చేయడం జరిగింది. మళ్లీ జూన్ 17 సోమవారం అన్నా క్యాంటీన్ జగ్గంపేట శాసనసభ్యులు జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ ఆదేశాలతో పునః ప్రారంభించారు. ఈ వారం అన్నా క్యాంటీన్ కు సహాయం అందించిన దాత జగ్గంపేట రుచి హెూటల్స్ అధినేత నాగేంద్ర చౌదరి ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ అన్న క్యాంటీన్ ప్రారంభించి పేదలకు అన్నదానం నిర్వహించిన కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు పట్టిన అన్నం పెట్టిన నాడే దేశానికి స్వతంత్రం వచ్చిన రోజు అని అన్న నందమూరి తారక రామారావు గారు అన్న మాటలను స్ఫూర్తిగా తీసుకుని ఈ అన్నా క్యాంటీన్ గత టిడిపి ప్రభుత్వంలో చంద్రబాబు ఏర్పాటు చేయడం జరిగిందని కానీ గత ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వం అన్నా క్యాంటీన్ రద్దు చేసిందని మళ్లీ ఇప్పుడు చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత ఐదు సంతకాల్లో ఒక సంతకం చేసి అన్నా క్యాంటీన్ పునరుద్ధరణ చేయడం జరిగిందని టిడిపి ప్రభుత్వం అన్నా క్యాంటీన్ జగ్గంపేటలో ఏర్పాటు చేసే వరకు దాతల సహకారంతో ప్రతి సోమవారం ఇక్కడ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. సేవా తత్పడు రుచి హెూటల్స్ అధినేత నాగేంద్ర చౌదరి ఈ వారం అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయడానికి సహాయం అందించారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, జీను మణి బాబు, రుచి హెూటల్స్ నాగేంద్ర చౌదరి, సత్తి సదాశివరెడ్డి, జాస్తి వసంత్, భూపాలపట్నం ప్రసాద్, ధాపర్తి సీతారామయ్య, వేములకొండ జోగారావు, బద్ది సురేష్, యల్లమిల్లి సీఎం, కింగం రమణ, నేదురి గణేష్, తోలుగంటి ప్రవీణ్ రెడ్డి, రాయి సాయి, అరటా పోలీస్, కురుమళ్ళ నాగేశ్వరరావు, కుంచె రామకృష్ణ, దేగల సత్తిబాబు, కొండ్రోతు శ్రీను, ఎండి కాజా, మానేపల్లి సాయి, చేలికాని హరిగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపి తంగెళ్ళ కు మల్లాడి అభినందనలు



**కాకినాడ,మేజర్ న్యూస్ :** ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాకినాడ పార్లమెంట్ సభ్యునిగా ఘన విజయం సాధించిన తంగేళ్ల ఉదయ శ్రీనివాస్ ను మర్యాద పూర్వకంగా కలిసి డా।। మల్లాడి రాజేంద్రప్రసాద్ అభినందనలు తెలిపారు. చిన్న వయసులోనే పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికయి రికార్డ్ సృష్టించడమే కాకుండా రాబోవు రోజుల్లో కాకినాడ పార్లమెంటుని అభివృద్ధి పదాన నడిపించి, యువతకు ఆదర్శప్రాయునిగా ఉదయ శ్రీనివాస్ ఉండబోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో 20వ డివిజన్ జనసేన ఇంచార్జ్ బస్వాని నాగబాబు, 16వ డివిజన్ జనసేన ఇంచార్జ్ వరిపిల్లి ప్రసాద్, 19వ డివిజన్ తెలుగుదేశం ఇంచార్జి చింతపల్లి తాతారావు, గంపల సత్యానందం, సంగాని బాలమహేశ్వరరావు, వీరెల్లి ఏసు, మామిడికుదురు ప్రసాద్, పొట్టి పెద్ద బాబు పాల్గొన్నారు.

## మమ్మల్ని రెగ్యులర్ చేయండి

- మాజీ ఎమ్మెల్యే వర్మకు వినతి పత్రం అందజేసిన వెలుగు టీచర్స్ ఫెడరేషన్



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** మాకు ఇచ్చిన హామీ ప్రకారం మమ్మల్ని రెగ్యులర్ చేయాలని పిఠాపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ వెలుగు టీచర్స్ ఫెడరేషన్ సభ్యులు మాజీ ఎమ్మెల్యే వర్మను కలిసి వినతి పత్రాన్ని అందచేసారు. 2018లో డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకారం సెలెక్ట్ అయిన అభ్యర్థులని రెగ్యులర్ చేయలేదని ఈ విషయాన్ని గతంలో చంద్రబాబుకి, యువగళం పాదయాత్ర లో లోకేష్ కు, వారహి యాత్రలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కి తెలపడం జరిగిందని వారు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక వారి సమస్యలు పరిష్కరిస్తామన్న హామీని నెరవేర్చే విధంగా మరోసారి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్ళాలని వర్మకి విజ్ఞప్తి చేసారు. గత వైకాపా ప్రభుత్వం మినిమం టైమ్స్ ఉద్యోగాలు ఇచ్చి రెగ్యులర్ ఇచ్చామని చెప్పుకొచ్చారని, వైకాపా ప్రభుత్వం తమని మోసం చేసిందని అన్నారు. తమని ఇప్పటికైనా రెగ్యులర్ ఉద్యోగాలు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వెలుగు టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు పిల్ల వెలుగు జ్యోతి, మాజీ జెడ్పిటిసి మడికి ప్రసాద్, అప్ప రాష్ట్ర అధ్యక్షులు పిల్లా చంద్రం, నాని,శ్రీను, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## కువైట్ మృతుల కుటుంబసభ్యులను పరామర్శించిన ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్








**పెరవలి, మేజర్ న్యూస్ :** కువైట్‌లో జరిగిన అగ్ని ప్రమాద ఘటన లో మృతిచెందిన తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ఖండవల్లి గ్రామానికి చెందిన మొల్లేటి సత్యనారాయణ (44),అన్నవరప్పాడు గ్రామానికి చెందిన మీసాల ఈశ్వరరావు (46) సౌదీ అరేబియాలో అనారోగ్యంతో మృతి చెందిననల్లాకులవారిపాలెం గ్రామస్తులు చోడబత్తుల విజయరాజు 40 ల కుటుంబ సభ్యులను జూన్ 17వ తేదీ ఆదివారం శాసనమండలి సభ్యులు వంక రవీంద్రనాథ్ పరామర్శించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు పెరవలి మండలం నల్లకులవారిపాలెం గ్రామస్తులు చోడ బత్తుల విజయరాజు ఉపాధి నిమిత్తం సౌదీ అరేబియా వెళ్లి పని ఒత్తిడి వల్ల అనారోగ్యం పాలై అక్కడ మరణించడం జరిగింది సౌదీఅరేబియ నుండి బాడీనితీసుకురావడంలో నలాకులవారి పాలెం గ్రామ సర్పంచ్ నల్లాకుల వెంకటేశ్వరరావు పెరవలి మండలం లైన్స్ క్లబ్ ఫాస్ట్ ప్రెసిడెంట్ సలాది ఉదయ భాస్కరరావు జిల్లా లైన్స్ గవర్నర్ కైండ్ నెస్ సొసైటీ అధ్యక్షులు గట్టిం మాణిక్యాలరావు బిజెపి నాయకులు గంగుల మురళీధర్ రెడ్డి ల కృషి తో తన భర్త మృత దేహాన్ని తీసుకురాగలిగామని ఆమె ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ కు చెప్తూ కన్నీటి పర్యంతమయ్యారు దీనిపై స్పందించిన పెరవలి మండలం లైన్స్ క్లబ్ వ్యవస్థాపకులు శాసన మండలి సభ్యులు రవళి స్పిన్నర్స్ అధినేత వంక రవీంద్రనాథ్ స్పందిస్తూ వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు మొల్లేటి శ్రీనివాసరావు కుమారుడు కు తమ రవళి స్పిన్నర్స్ లో ఉపాధి కల్పిస్తానని హామీ ఇచ్చారు మీసాల ఈశ్వరరావు కుమారుడుకు ఉన్నత చదువులు నిమిత్తం సాయం అందిస్తానని హామీ ఇచ్చారు వారికి అవసరమైతే తన ఫ్యాక్టరీలలో ఉపాధి అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఖండవల్లి గ్రామ సర్పంచ్ నాగరాజు ఉప సర్పంచ్ అతికాల శ్రీను రెడ్డి సత్యనారాయణ సానబోయిన హనుమంతు అనుకుల శ్రీను పంతం చిన్న పంతం నాగులు నల్లకులవారిపాలెం సర్పంచ్ నల్లకుల వెంకటేశ్వరరావు కోపెళ్ళ చినబాబు కోలా వెంకట శ్రీనివాస్ పెరవలి మండలం లైన్స్ క్లబ్ అధ్యక్షుడు కోలా సీతయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై హర్షం



**గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన గొల్లప్రోలు పట్టణ శివారు బిజెపి కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గొల్లప్రోలు పట్టణ బిజెపి పార్టీ అధ్యక్షుడు చిట్టామధు మాట్లాడుతూ ఎన్‌డిఏ ప్రభుత్వంలో ఉమ్మడి కూటమి అభ్యర్థి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం సందర్భంగా ప్రథమంగా పెట్టిన సంతకాలలో ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దుపై, మెగా డీఎస్సిపై, అన్నా క్యాంటీన్ లు పునరుద్ధరణపై ప్రథమ సంతకం సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. టీటీడీ లో వృద్ధుల కొరకు టీటీడీ ప్రత్యేక దర్శనం కల్పించినందున బిజెపి, జనసేన, టిడిపి కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియపరుస్తూ హర్షం వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ జిల్లా నాయకులు కర్రి సత్యనారాయణ, పడాల శ్రీనివాస్, బిజెపి పార్టీ సీనియర్ నాయకుడు మల్లిరెడ్డి నారాయణరావు, తంగెళ్ల బాబురావు, సిపూరి భాస్కరరావు, రైతు కొసిరెడ్డి అప్పలరాజు, దళిత బిజెపి నాయకుడు బర్రె చక్రం, తుంగూరు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి అన్నదాన భవన నిర్మాణానికి సోమవారం ర్యాలీ గ్రామానికి కొడాటి రవి కిషోర్ వెంకట రత్న కుమారి దంపతులు రూ.లక్ష విరాళాన్ని అందించారు. వీరికి ఆలయ అర్చక బంధం ఆలయం మర్యాదలతో స్వాగతం పలికి స్వామి చరిత్ర గురించి వివరించారు. డిప్యూటీ కమిషనర్ భూపతిరాజు కిషోర్ కుమార్, సిబ్బంది స్వామివారి చిత్రపటం అందించారు.

సూర్య
తూర్పుగోదావరి
మంగళవారం
18 జూన్ 2024



## కవి 'పొలమూరి'ని సత్కరించిన శ్రీశ్రీ కళావేదిక



**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** తిరుపతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో డాక్టర్ బి.ఆర్. కోనసీమ జిల్లా అంబాజీపేటకు చెందిన సహజ కవి పొలమూరి వెంకట్ ను ఘనంగా సత్కరించారు. శ్రీశ్రీ కళావేదిక 135వ జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో సత్కరించారు. అందరికీ అర్థమయ్యే రీతిలో కవితలను అందిస్తూ కవిగా మంచి గుర్తింపు పొందారు. పేరుగాంచారు. సమాజ మార్పు కోసం తన సహజమైన శైలిలో రూపొందించిన కవితను ఎంపిక చేయడంతో ఘనంగా సన్మానించారు. శ్రీ కళా వేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు.

## భక్తి శ్రద్ధలతో బక్రీద్



**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ పండుగను మండలంలోని ముస్లీం సోదరులు ఎంతో భక్తి శ్రద్ధలతో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక పెద్దవీధిలో ఉన్న అంజూమనే ఇందాదుల్ ముస్లిమీన్ మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అంబాజీపేట సెంటర్ మీదుగా ఖబరస్తాన్ కు చేరుకుని మృతులకు నివాళ్ళర్పించారు. ఈ కార్యక్రమంలో ఎం.డీ.రఫీ, ఆరీఫ్, పాషా, కరీం, జాకీర్, వలీ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపేటలో మటన్ మాఫియా..

### -నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు..
### -మామ్ముళ్ల మత్తులో జోగుతున్న అధికారులు



**కొత్తపేట, మేజర్ న్యూస్ :** కొంతమంది మాంసాహారం ప్రియులకు ముక్క లేనిదే ముద్ద దిగదు.ఆదివారం వచ్చిందటే మాంసం దుకాణాల వద్దకు క్యూ కడతారు.అయితే మనం తినే మటన్ మంచిదా..కుళ్లిందా అని తెలుసుకోవడం చాలా కష్టం.సాధారణంగా ముదురు మటన్ వాసన రాదు.తోక చిన్నగా ఉంటే లేతది అని..తోక పెద్దగా ఉంటే ముదురు మటన్ అంటారు. కానీ మటన్ షాపు వాళ్లు తోకలు లేకుండానే మటన్ అమ్మకాలు కొనసాగిస్తున్నారు.కాస్త తక్కువ ధరకు దొరుకుతుందని కొనేసి ఇంటికి తీసికెళ్ళి మసాలా దట్టించి వండి లాగించేస్తారు.ప్రస్తుతం ఈ మటన్ కు ఎంత డిమాండ్ ఉందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు.ఒకప్పుడు కిలో 500లోపు ఉండే మటన్ ఇప్పుడు వెయ్యికి చేరువైంది. కరోనా కష్టకాలం నుంచే నాన్ వెజ్‌కు డిమాండ్ పెరిగింది. దాంతో పాటే మటన్ ధరకూడా అమాంతంగా పెరిగిపోయింది.మాంసం ఎక్కువగా తింటే శరీరానికి కావాల్సిన ప్రొటీన్స్ అందడంతో పాటుగా రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.దీంతో మాంసాహార ప్రియులు మాంసం దుకాణాలకు పరుగులేడతారు.ఇక ప్రజల డిమాండ్ ను క్యాష్ చేసుకోవాలనుకున్న కొందరు వ్యాపారుల ఆగడాలకు అడ్డుకట్ట పడటం లేదు. అధికారులు తనిఖీలు నిర్వహించాల్సి ఉన్నా నిమ్మకునీరెత్తినట్లు ఉన్నారు.ఇదే ఆసరా చేసుకుని మటన్ వ్యాపారుల్లో మాత్రం అదే నిర్లక్ష్యం వహిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతూనే ఉన్నారు.సంబంధించిన అధికారులు దాడులు నిర్వహిస్తే నిజానిజాలు బయటపడతాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.అసలుఅ నారోగ్యంతో చనిపోయిన గొర్రెల మాంసాన్ని అధికారుల స్టాంప్ లేకుండా విక్రయాలు జరుగుతున్న అధికారుల్లో చలనం లేదు.అధికారుల నిబంధనలను లెక్క చేయకుండా విక్రయాలు జరుపుతూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. మిగిలిన మటన్ ని ఇంటి వద్దనే ఫ్రిజర్లు ఏర్పాటు చేసుకుని నిల్వచేసి మరుసటి రోజు మరల విక్రయాలు జరుపుతున్నారు.ఇంత జరుగుతున్న అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కొంతమంది అధికారులు అయితే మాంసం విక్రయధారుల మామూళ్ళ మాయలోపడి నిబంధనలను గాలికివదిలేసారు.ఇప్పటికైన పంచాయితీ,వెటర్నరీ, ఆహార భద్రత శాఖలకు సంబంధించిన ఉన్నతాధికారులు స్పందించి ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని నిబంధనలకు విరుద్ధంగా మటన్ విక్రయాలు జరుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

**-ప్రభుత్వ నిబంధనలకు తూట్లు..**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం..కబేళాలో మటన్, బీఫ్ వ్యాపారం చేసేవారు తప్పనిసరిగా సంబంధిత జంతువు శరీరంపై వీఎంసీ స్టాంప్ వేయించుకుని విక్రయాలు చేయాలి.అయితే మేక,గొర్రెలకు స్టాంప్ లేకుండా మాంసం వ్యాపారులు యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. అధికారులు దాడులు చేయకపోవడంతో వ్యాపారుల్లో మార్పు రావడం లేదు.కాబట్టి, ప్రజలు మాంసం కొనుగోలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని పలువురు సూచిస్తున్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- గర్భిణీ స్త్రీలు, షుగర్ వ్యాధిగ్రస్తులు తగు జాగ్రత్తలు పాటించాలి
- పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డా.సుజాత



**పిఠాపురం,మేజర్‌న్యూస్:** వేడి వాతావరణం నుంచి చల్లని వాతావరణం లోకి మారుతున్న దృష్ట్యా ప్రబలే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పిఠాపురం ప్రభుత్వాసుపత్రి సూపరిండెంట్( ప్రధాన వైద్యాధికారి)డా.సుజాతఅన్నారు. వాతావరణంలో మార్పులు ఏర్పడి కాలం మారుతున్న వేళ సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, డయేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వాంతులు విరోచనాలు వంటివి రోజుల తరబడి అవుతుంటే అశ్రద్ధ చేయవద్దని కోరారు. సీజనల్ వ్యాధులు అనగా డయోరియా వంటి లక్షణాలు కనిపిస్తే..ప్రభుత్వఆసుపత్రిలో వైద్యం చేయించుకోవాలని, పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో సీజనల్ వ్యాధులకు అన్ని రకాల మందులు అందుబాటులలో ఉన్నాయని అన్నారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు, షుగర్ వ్యాధిగ్రస్తులు తగు జాగ్రత్తలు పాటించాలని, వాంతులు విరోచనాలు అంటే డయేరియా లక్షణాలు కనిపిస్తే... సొంత వైద్యం మానుకోవాలని, బయట వ్యక్తులను సంప్రదించి వైద్యం చేయించుకోవడం మంచిది కాదని, వెంటనే వైద్యులను సంప్రదించి, వైద్యుల సూచన మేరకే తగిన వైద్యం పొందాలని డాక్టర్ సుజాత సూచించారు.

**-అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి : డా. సుజాత**

పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో సీజనల్ వ్యాధులకు సంబంధించి అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని, 24 గంటలు అందుబాటులో ఉంటారని, సీజనల్ వ్యాధులకు సంబంధించి ఎటువంటి లక్షణాలు కనిపించినా వెంటనే ప్రభుత్వాసుపత్రిలో వైద్యులను సంప్రదించి తగిన వైద్యం పొందాలని అన్నారు.

**-శానిటేషన్ మెరుగుపరుస్తాం : డా. సుజాత**

పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న అపారిశుధ్యంపై విలేకరులు ప్రశ్నించగా ఆమె స్పందించారు. పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో శానిటేషన్ మరింత మెరుగుపరుస్తామని, రోగులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తగు చర్యలు చేపడతామని, పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన రోగులకు పరిశుభ్రమైన పరిసరాల్లో... సరైనటువంటి వైద్యం అందించడమే తమ ప్రధాన లక్ష్యమని డాక్టర్ సుజాత తెలిపారు.

## నియోజకవర్గ యాదవుల అధ్యక్షునిగా నాగరాజు



**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** పి.గన్నవరం నియోజకవర్గ యాదవుల సంఘ అధ్యక్షునిగా నాగళ్ల నాగరాజు ఎన్నికయ్యారు. కె. పెదపూడిలో నియోజకవర్గ యాదవుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా గొన్నురు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి చిట్టిమేను రమణ, జాయింట్ సెక్రటరీ గాలి వీర వెంకట బాలాజీ, ట్రెజరర్ మట్టా రెడ్డిలతో పాటు సభ్యునులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ సంఘ అభివృద్ధి సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానన్నారు. సంఘ అభివృద్ధికి సంఘ పెద్దలతోను, కమిటీ సభ్యుందరితో ముందుకు సాగుతానన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను సంఘ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వెంకట సత్యనారాయణరాజు యాదవ్, వంద్రపాటి విగ్నేశ్వరుడు, సూరిమేను సుబ్రహ్మణ్యం,మాగాపుసత్యనారాయణ, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

## శృంగార వల్లభ స్వామి సన్నిధిలో ఎమ్మెల్యే చినరాజప్ప పూజలు

### - పాల్గొన్న జనసేన జిల్లా అధ్యక్షులు



**పెద్దాపురం, రూరల్, మేజర్‌న్యూస్ :** పెద్దాపురం తొలి తిరుపతి గ్రామంలో వేంచేసియున్న శ్రీ శృంగార వల్లభ స్వామి వారిని సోమవారం పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి దేవస్థాన కార్యనిర్వాహణాధికారి వడ్డి శ్రీనివాసరావు, వేదపండితులు పెద్దింటి నారాయణాచార్యులు, పెద్దింటి పురుషోత్తమాచార్యులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి, స్వామివారి దర్శనం కల్పించి, వేద ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం స్వామి వార్కి ఎమ్మెల్యే చినరాజప్ప తులాభారం సమర్పించడం జరిగింది. దీనిలో భాగంగా జనసేన జిల్లా అధ్యక్షులు మరియు పెద్దాపురం నియోజకవర్గా జనసేన ఇన్‌చార్జి తుమ్మల రామస్వామి (బాబు) స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం వీరికి ఇఓ మరియు వేదపండితులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు నిమ్మకాయల రంగనాగ్, తిరుపతి సర్పంచ్ మొయిళ్ళ కృష్ణమూర్తి, టిడిపి మండలాధ్యక్షులు కొత్తెం వెంకట శ్రీనివాసరావు (కోటి), జల్దాని సుబ్రహ్మణ్యం (బాబీ), దివిలి సర్పంచ్ పెంకే శ్రీను, జిగిని రాజుబాబు, పలువురు టిడిపి, జనసేన నాయకులు కార్యకర్తలు, దేవస్థాన సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. దీనిలో భాగంగా ఎమ్మెల్యే చినరాజప్ప దేవస్థాన ప్రాంగణంలో మొక్కలు నాటారు.

## కమలం గూటికి వైస్సార్సీపీ సర్పంచ్



**అనపర్తి, మేజర్ న్యూస్ :** మండలంలోని, రెండవ పెద్ద గ్రామమైన కుతుకులూరు గ్రామ వైస్సార్సీపీ సర్పంచ్ గొల్లు హేమ తులసి, సురేష్ దంపతులు అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సమక్షంలో కమలం గూటికి చేరారు. సర్పంచ్ దంపతులతో పాటు అదే గ్రామానికి చెందిన మరో 20 కుటుంబాలకు చెందిన ప్రజలు బీజేపీలోకి చేరారు. పార్టీలో చేరిన అందరికీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామ అభివృద్ధి స్థానిక ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డితోనే సాధ్యమని, రామకృష్ణారెడ్డి సారుధ్యంలో గ్రామాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేయడం సాధ్యమని హేమ తులసి, ఇతర ప్రజలు అన్నారు. అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి సారధ్యంలో అనపర్తి నియోజకవర్గం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందుతుందని, రానున్న రోజుల్లో అనపర్తి నియోజకవర్గములో చాలా గ్రామాలకు చెందిన వైసీపీ సర్పంచులు కమలం గూటికి చేరెందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

# హత్య కేసు చేదించిన పిఠాపురం పోలీసులు



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం మండలం భోగాపురం గ్రామంలో జరిగిన హత్య కేసును పోలీసులు చేదించారు. ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. ది.14-06-2024 వ తేదీ అర్ధ రాత్రి సుమారు 1:00 గం.లకు పిఠాపురం మండలం, భోగాపురం గ్రామం, శ్రీ విజయ దుర్గ అమ్మవారి ఆలయ ఆవరణలో జరిగిన హత్య కేసుకు సంబందించి మృతుని సోదరుడు బొమ్మదేవు శ్రీనివాసరావు అను వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు ఇచ్చి ఉన్నారని, సదరు ఫిర్యాదుపై 132/2024 : 302 అఫ్ పిఠాపురం రూరల్ పోలీస్ స్టేషన్ హత్యకేసు నమోదు చేసి అనంతరం కాకినాడ జిల్లా గౌరవ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎస్.సతీష్ కుమార్ ఆదేశముల మేరకు, ఎస్‌డిపిఓ కె. హనుమంతరావు పర్యవేక్షణలో పిఠాపురం సిఐ జి.శ్రీనివాస్ రెండు బృందాలను ఏర్పాటు చేసి ముద్దాయి కోసం ముమ్మరంగా గాలించడం జరిగింది. అయితే ఈకేసులో ముద్దాయి నాగులపల్లి పద్మరాజు, భోగాపురం గ్రామం అను వానిని ది. 17-06-2024 వ తేదీన మధ్యాహ్నం 2.20 గంటలకు, బి.పత్తిపాడు గ్రామ జంక్షన్ వద్ద గల శ్రీ శివ శంకర రైస్ మిల్లు వద్ద అరెస్టు చేసి, మృతుని తలపై మోదిన సిమెంట్ దిమ్మను, రక్తపు మరకలు గల బట్టలు స్వాధీనం చేసుకోవడమైనదని పేర్కొన్నారు. మా యొక్క దర్యాప్తు మరియు ముద్దాయి ఇచ్చిన నేరఒప్పుదల స్టేట్మెంట్ ప్రకారం మృతుడు బొమ్మదేవు ప్రసాదు మరియు ముద్దాయి నాగులపల్లి పద్మరాజు ఎప్పటి నుండో కలిసి తాపీ పనులు చేసుకొని భోగాపురం గ్రామంలో జీవిస్తున్నట్లు, గత కొద్ది కాలం కాకినాడ గాంధీనగర్ పార్కు వద్ద వారికి తెలిసిన మేస్త్రి వద్దకు కూలీ పనులకు వెళ్ళుచున్నట్లు, అచ్చట సుమారు 15 రోజులు పని చేసి మృతుడు మరియు ముద్దాయి డబ్బులు తెచ్చుకుంటూ ఉంటునన్నట్లు. ది .వి 13-06-2024 వ తేదీన సాయంత్రం మృతుడు కాకినాడ మేస్త్రి వద్దకు వెళ్ళి డబ్బులు అడుగుగా మృతుని డబ్బులు ముద్దాయి కి ఇచ్చేసిన్నట్లు మేస్త్రి చెప్పగా అంతట మృతుడు ముద్దాయి వద్దకు వెళ్ళి డబ్బులు గురించి అడుగగా... ముద్దాయి నేను నీ డబ్బులు తీసుకోలేదన్నట్లు అంతట వారు ఇద్దరు డబ్బులు విషయమై రాత్రి 11.00 గంటల సమయంలో గొడవ పడిన్నట్లు, ముద్దాయి మృతుడిని చంపుతానని బెదిరించిన్నట్లు, ఎలాగైనా చంపేయాలని ఉద్దేశంతో శ్రీ విజయ దుర్గ అమ్మవారి గుడి వద్దకు రాత్రి సుమారు 01.00 గంటల వచ్చిన్నట్లు, మృతుడు గుడి ఆవరణంలో నేలపై పడుకుని నిద్రలో ఉండగా రోడ్డు ప్రక్కన ఉన్న సిమెంట్ దిమ్మను మోసుకుని వచ్చి పడుకుని ఉన్న మృతిని తలపై విచక్షణరహితంగా బలంగా ఇష్టం వచ్చినట్లు పలుమార్లు కొట్టి చంపినాడు అని తెలిపారు.

## చేనేతలను ఆదరించాలి - పెద్దిరాజు





**కాకినాడ,మేజర్‌న్యూస్:** ప్రజలు చేనేత వస్త్రాలు విరివిగా కొనుగోలు చేసి చేనేత కార్మికులను ఆదరించాలని జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి కె.పెద్దిరాజు కోరారు. జిల్లా చేనేత మరియు జౌళి శాఖ అధికారి, కాకినాడ, వారి నిర్వహణలో16నుండి22 వరకు 7రోజుల పాటు ఈ ప్రదర్శన ఉంటుందన్నారు. జిల్లా పోలీసు కార్యాలయం ప్రక్కన చేనేత సహకార సంఘముల ఆధ్వర్యములో చేనేత వస్త్ర ప్రదర్శన మరియు అమ్మకములుజరుగుతాయన్నారు.ఈ ప్రదర్శనలో రాష్ట్రంలోని ప్రఖ్యాతి గాంచిన వివిధ జిల్లాల చేనేత మరియు పట్టు వస్త్రాలతోపాటు కాటన్, మెర్సిడైఖేడ్, టై & డై చీరలు, సికో చీరలు, మాధవరం, వెంకటగిరి, జరీచీరలు, మంగళగిరి డ్రెస్ మెటీరియల్స్, ఉప్పాడ జమధాని చీరలు, షర్టింగ్స్, కలంకారి వస్త్రాలు, పెద్దాపురం సిల్క్ షర్టింగ్స్ మరియు ప్రఖ్యాతి గాంచిన బెడ్ షీట్స్ మరియు ఇంకా పేరెన్నికిగన్న ఆకర్షణీయమైనవస్త్ర ఉత్పత్తులు అందుబాటులో ఉండునన్నారు.ఈ వస్త్ర ప్రదర్శనకు ప్రవేశము ఉచితము మరియు చేనేత ఉత్పత్తులు సరసమైన ధరలకు అందుబాటులో ఉంచబడినవని తెలిపారు.కాకినాడమరియు పరిసరప్రాంతములలో ఉన్నప్రజలుఈ అవకాశాన్ని సద్వినియోగ పర్చుకొని చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి, చేనేత వస్త్రాలను ధరించి నేత కార్మికులకు చేయుతనివ్వవలసినదిగా కోరారు.

## ఆలమూరులో మంత్రి సుభాష్‌కు ఘన స్వాగతం

### -భారీ బైక్ ర్యాలీతో సుభాష్ ప్రయాణం..
### -ర్యాలీలో జేబుదొంగలు హల్‌చల్




**ఆలమూరు, మేజర్‌న్యూస్ :** రామచంద్రపురం నియోజవర్గంలో అఖండ మెజార్టీతో విజయం సాధించిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో క్యాబినెట్ హోదాతో కార్మిక, పరిశ్రమల, బీమా వైద్యసేవల శాఖా మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వాసంశెట్టి సుభాష్ మొట్టమొదటిసారిగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు తెలుగుదేశం,జనసేన,బిజెపి యువకులు, కార్యకర్తల మధ్య వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భారీ బైక్ ర్యాలీతో రోడ్ షో ద్వారా విచ్చేసి ఉన్నారు.దీనిలో భాగంగా కొత్తపేట నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ బండారు శ్రీనివాసు ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు మధ్య మంత్రి వాసంశెట్టికి ఆలమూరు మండలంలోని ఘన స్వాగతం లభించింది. ముందుగా జొన్నాడ గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహానికి సుభాష్ పూలమాలవేసి నివాళులర్పించి భారీ కేక్ కట్ చేశారు.టిడిపి నేతల నేతృత్వంలో భారీ క్రేన్ల సహాయంతో గజమాలను వేసి ఘనస్వాగతం పలికారు. అలాగే మండల కేంద్రమైన ఆలమూరులో టిడిపి శ్రేణుల ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి మంత్రి సుభాష్ పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత, శ్రీ మురళీకృష్ణ సంస్థల అధినేత ఒంటిపల్లి పాపారావు స్వగృహం వద్ద సుభాష్ కు ఘనస్వాగతం లభించింది.సుభాష్ ఆశయాలకు అనుగుణంగా పాపారావు పుస్తకాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పాపారావు తల్లి వెంకట సత్యవతి ఆశీర్వాదం తీసుకున్నారు. పెద్దవారి ఆశీర్వాదం తనపై ఎప్పుడూ ఉండాలని మంత్రి సుభాష్ అన్నారు. పాపారావు ఇంటి వద్ద అల్పాహారం తీసుకున్నారు. కూటమి విజయానికి పాపారావు చేసిన కృషిని ఈ సందర్భంగా కొనియాడారు. ఇదే తరుణంలో భారీ ర్యాలీతో సుభాష్ ముందుకు సాగడంతో కొత్తూరు సెంటర్లోని చింతలూరు, పెద్దపళ్ల, సంధిపూడి, సూర్యారావుపేట, కలవచర్ల,పెనికేరు గ్రామాలకు చెందిన టిడిపి శ్రేణులు అధిక సంఖ్యలో విచ్చేసి ఘన స్వాగతం పలికారు. ఇదే అదునుగా చూసిన ఒక జేబుదొంగ కార్యకర్తల జేబులో దొంగతనం చేస్తూ హల్చల్ చేస్తూ దొరికిపోగా వారు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.అనంతరం గుమ్మిలేరు గ్రామంలో మోదుకూరు నర్సిపూడి, నవాబుపేట గ్రామాలకు చెందిన టిపి శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. సుభాష్ అందరి మన్ననలతో ముందుకు సాగారు.

## స్కూల్ మరియు మెడికల్ షాప్ ప్రారంభించిన జనసేన ఇన్చార్జి తుమ్మలపల్లి



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** కిర్లంపూడి మండలం రామచంద్రపురం గ్రామంలో తామరాడ గ్రామానికి చెందిన సేనాపతి గంగబాబు కుమారుడు శివ నూతన మెడికల్ షాప్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ను జగ్గంపేట జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాదారపు వీరబాబు, అనుకుల శ్రీకాంత్, తామరాడ ఎంపీటీసీ గోకాడ రాజా, రామచంద్రపురం ఎంపీటీసీ బండారు ప్రసాద్, గోకేడ రమణ, రామచంద్రపురం వైస్ ప్రెసిడెంట్ రేవూరి శ్రీనివాస్ పాల్గొన్నారు. అదేవిధంగా దివిలి గ్రామంలో తిరుమల ఇంగ్లీష్ మీడియం స్కూల్ ను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పతో తుమ్మలపల్లి రమేష్ ప్రారంభించడం జరిగింది.

## త్యాగానికి ప్రతీక బక్రీద్



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ముస్లిం సమాజానికి అత్యంత పవిత్రమైన రోజులలో బక్రీద్ ఒకటని ఇది త్యాగానికి ప్రతీక అని రమణయ్యపేట మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో బక్రీద్ పండుగను పురస్కరించుకుని పేద ముస్లిం మహిళలకు నూతన వస్త్రాలు పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఈ పండుగను ఘనంగా జరుపుకుంటారని అడబాల తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి సుబ్బారావు, రేలంగి బాపిరాజు, రాజా, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.